సాక్షి
శ్రీకాకుళం
బుధవారం। 9। ఏప్రిల్। 2025



అధికారులదే బాధ్యత..

జెడ్పీ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. పలు సమస్యలు ప్రస్తావనకు వచ్చాయి.

- 8లో



పేద కుటుంబంపై కక్ష

ఓ పేద కుటుంబంపై అధికార పార్టీ కక్ష సాధిస్తోంది. సాగుభూమిని స్వాధీనం చేసుకుంటోంది.

- 8లో

నేడు హోం మంత్రి రాక


శ్రీకాకుళం క్రైమ్: హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 11:30 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మన్యం పార్వతీపురం విజయనగరం శ్రీకాకుళం జిల్లాల పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతారు. మధ్యాహ్నం రెండు గంటలకు నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రామాంజనేయ అపార్ట్‌మెంట్‌లో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న లతశ్రీని పరామర్శిస్తారు.

ఫలక్ ...... నుమా



పలాస రైల్వేస్టేషన్ సమీపంలో రెండుగా విడిపోయిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్

పలాస వరకు ప్రయాణం సాఫీగానే సాగింది. అక్కడ బండి ఆగడం.. మళ్లీ బయల్దేరడం సజావుగానే జరిగింది. కానీ పది నిమిషాల్లోనే పరిస్థితి మారిపోయింది. ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఇంజిన్‌కు అనుసంధానమై ఉన్న బోగీలు మందస వరకు వెళ్లిపోగా.. వెనుక ఉన్న బోగీలు మాత్రం సుమ్మాదేవి వద్దే ఆగిపోయాయి. బోగీల లింక్ తెగిపోయిందని తెలుసుకునేలోపే ఇంజిన్ దాదాపు పది కిలోమీటర్ల దూరం వెళ్లిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మూడు గంటల పాటు పడరాని పాట్లు పడ్డారు. లక్ కలిసిరావడంతో పెను ప్రమాదం తప్పి ఊపిరి పీల్చుకున్నారు.



పలాస స్టేషన్‌కు ఫలక్‌నుమా వచ్చిన సమయం	బయల్దేరిన వేళ	లింకు తెగిన వేళ	ఇంజిన్‌ను జత చేసి తిరిగి పంపించిన సమయం
ఉదయం 6.55 గంటలకు	7.00	7.09	10.23



రైలు పట్టాలపై నిలిచిపోయిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి బయటకు భయంగా వచ్చిన ప్రయాణికులు

- బోగీల మధ్య లింకు తెగిపోవడంతో ఘటన
- తీవ్ర భయాందోళనకు గురైన ప్రయాణికులు
- మూడు గంటల ఆలస్యంతో పాట్లు పడిన వైనం
- ఆలస్యంగా నడిచిన పలు రైళ్లు

కాశీబుగ్గ / ఇచ్ఛాపురం టౌన్ / కంచిలి:

సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12704)కు మంగళవారం పలాస మండలం సుమ్మాదేవి గేటు వద్ద పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు, రైల్వేశాఖ అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఘటనకు సంబంధించి రైల్వే సిబ్బంది, స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు..

- సికింద్రాబాద్ నుంచి సోమవారం ప్రారంభమైన ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం ఉదయం ఏడు గంటల సమయంలో పలాస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు దింపి భువనేశ్వర్ వైపు బయలుదేరింది.
- పలాస రైలు నిలయం నుంచి ఏడుకిలోమీటర్ల దూరంలో ఉన్న సుమ్మాదేవి రైల్వేస్టేషన్‌కు అతి వేగంగా చేరుకునే సమయంలో 7 : 10 నిమిషాలకు సున్నాదేవి స్టేషన్ ముందు గేటు వద్ద రెండు బోగీల మధ్య ఇనుప లింకు తెగిపడింది.
- దీంతో ఫలక్‌నుమా రైలు 14 బోగీలు ఒకవైపు 08 బోగీలు మరో వైపు విడిపోయాయి.
- ఎ-1, ఎం-6 బోగీల మధ్య లింకు తెగిపోయింది.
- ఇంజిన్‌తో ఉన్న బోగీలు సమీప మందస రైల్వేస్టేషన్‌కు చేరుకోగా మిగిలిన బోగీలు నెమ్మదిగా రైలు పట్టాలపై నిలిచిపోయాయి.
- రైలులో ఉండే గార్డు లోకో పైలెట్‌కు సమాచారం ఇచ్చే సమయానికి పది కిలోమీటర్ల దూరంలో మందస వెళ్లిపోగా అక్కడ రైలు బోగీలను పరిశీలన చేశారు.
- మరో సారి వెనుక నుంచి రైళ్లు వచ్చి ఢీకొంటాయేమోనని ప్రయాణికులు రైలు నుంచి దిగి చెట్ల కింద తలదాచుకున్నారు. రైల్వేశాఖ తక్షణమే స్పందించినా ఇంజిన్‌ను సున్నాదేవి వరకు తీసుకువచ్చి అక్కడ ఉన్న బోగీలకు లింకు చేసి పంపించే సరికి సమయం సుమారు 10.20 దాటింది. సుమారు మూడు గంటల పాటు ప్రయాణికులు పాట్లు పడ్డారు. మందస, ఇచ్ఛాపురం, బ్రహ్మపురం రైలు నిలయాలలో ప్రయాణికులకు అవసరమైన తాగునీరు, ఫలహారాలను రైల్వేశాఖ తరపున అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించగా రైల్వే సిబ్బంది వారికి అందజేశారు. లింకు తెగిపోవడానికి గల కారణాలపై రైల్వే శాఖ అధికారులు విచారణ చేపడుతున్నారు. సూపర్ ఫాస్ట్ రైలు ట్రాక్‌పై ఉండిపోయిందని తెలియడంతో ఒక్కసారిగా అటుగా రాకపోకలు జరిపే రైళ్లను మూడు గంటల పాటు ఆలస్యంగా నడిపారు.



ఎ-1 బోగి, ఎం-6 బోగీ మధ్యలో విరిగిపడిన లింకును పరిశీలిస్తున్న అధికారులు

ఆలస్యంగా నడిచిన రైళ్లు

సుమ్మాదేవి సమీపంలో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు తెగిపోయిన ఘటనతో పలు రైలు ఆలస్యంగా నడిచాయి. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ తర్వాత ఆ మార్గంలో వచ్చిన రైళ్లు ఉదయం పూట వచ్చేవన్నీ నిర్దేశించిన సమయానికి సుమారు గంటన్నర ఆలస్యంగా వచ్చాయి. సోంపేట స్టేషన్‌కు ఉదయం 9.30 గంటలకు రావల్సిన చెన్నై-పూరి(రైలు నంబర్:22860) వీక్లీ ఎక్స్‌ప్రెస్ 10.52 గంటలకు వచ్చింది. అదే విధంగా 9.33 గంటలకు రావాల్సిన తిరుపతి-పూరీ(రైలు నంబర్:17480) వీక్లీ ఎక్స్‌ప్రెస్ 11.15 గంటలకు వచ్చింది. ఇక గుణుపూర్-పూరీ(రైలు నంబర్:18418) ఎక్స్‌ప్రెస్ 11.25కు వచ్చింది. ఇలా పలు రైళ్లు ఆ మార్గంలో నడిచేవి ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చెన్నై-పూరీ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను నౌపడ స్టేషన్‌లో గంటన్నరపాటు ఆపేశారు. ఇక తిరుపతి-పూరీ ఎక్స్‌ప్రెస్‌ను కోటబొమ్మాళి స్టేషన్‌లో గంటకు పైగా నిలిపివేశారు. ఇలా ఈ మార్గంలో వచ్చే రైళ్లను వివిధ స్టేషన్లలో నిలిపేయడంతో ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది.



సోంపేట స్టేషన్‌లో ఆగిన చెన్నై-పూరీ వీక్లీ ఎక్స్‌ప్రెస్

నీరు లేక ఇబ్బంది



ప్రమాదం జరిగిన చోట నీరు, ఆహారం లేక చాలా మంది ఇబ్బందిపడ్డారు. మందసలో పనులు ఆలస్యంగా చేశారు.

– మితిన్ బెహరా, పాత్రపురం, ఒడిశా



ఫలక్‌నుమా ట్రైన్

ఆకలితో అలమటించాం..



చెన్నై నుంచి సోంపేటకు వస్తున్న మేము ప్రయాణిస్తున్న రైలు ఫలక్‌నుమా ట్రైన్ ఘటనతో ఆలస్యంగా నడిచింది. దీంతో గంటన్నర ఆలస్యంగా వచ్చాము. దీంతో ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– మధుస్మితా పండా, కుమార్తె చిన్మయి పండా, ప్రయాణికురాలు, జలంత్రకోట గ్రామం, కంచిలి మండలం

ఆందోళన కలిగింది..



మా ముందు వెళ్తున్న రైలు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పిందని తెలిసిన తర్వాత మొదట ఆందోళనకు గురయ్యాం. చివరికి ప్రయాణికులెవ్వరికీ ఏమీ కాలేదని తెలిశాక తర్వాత ఊపిరి పీల్చుకున్నాం.

– గేదెల మోహనరావు, ప్రయాణికుడు, ఆర్. కరాపాడు గ్రామం, కవిటి మండలం

భయపడ్డాం



పలాస దాటిన తర్వాత కాసేపటికి మేము ఉన్న బోగీ వేగం తగ్గింది. ఇంతలో ట్రైన్ ఆగి చుట్టుపక్కల ఉన్న వారు కొన్ని బోగీలు తెగిపోయాయని తెలిపారు. దీంతో భయపడ్డాం. చాలా సమయం తర్వాత వేరే ఇంజిన్ వచ్చి బోగీలను ట్రైన్ వద్దకు తీసుకెళ్లింది.

– ఎం బలరాం, చీకటి గ్రామం, ఒడిశా

చాలా సమయం పట్టింది



పలాస దాటిన తర్వాత ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన స్థలం నుండి మందస వరకు వచ్చి అక్కడ ట్రైన్ రిపేరు చేసి ఇచ్ఛాపురం వచ్చేందుకు మూడు గంటలకు పైగా సమయం పట్టింది.

– ఎం.పద్మ, చీకటి గ్రామం, ఒడిశా

ఎలాంటి ప్రాణహాని లేనప్పటికి రైలులో ఉన్నవారంతా భయాందోళన చెందారు. అనంతరం భువనేశ్వర్ రైలు నిలయానికి చేరుకోవడంతో 3.20 ఏసీ-2 టైర్ బోగిని అనుసంధానం చేసి సాఫీగా ప్రయాణం సాగించినట్లు ఈస్ట్‌కోస్టు రైల్వే అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రవేశ పరీక్షల హాల్ టికెట్లు విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని మూడు బాలురు, ఆరు బాలికల బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–2026 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదల చేసినట్లు ఆ సంస్థల జిల్లా కో ఆర్డినేటర్ ఎన్.బాలాజీ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 13వ తేదీ ఆదివారం నాడు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు వారికి హాల్ టిక్కెట్‌లో కేటాయించిన పరీక్షా కేంద్రానికి మాత్రమే హాజరుకావాలని సూచించారు. apbragcet.apcfss.inనుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని, హాల్ టికెట్‌తో పాటుగా ఆధార్ కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకోవాలని తెలిపారు. వివరాలకు 9701736862 – 9000314209 నంబర్‌ను సంప్రదించాని తెలిపారు.

'జిల్లా అభివృద్ధిపై దృష్టి'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన సహచర మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా నరేగా పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.500 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ పనులు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో గుంతలు లేని రోడ్ల పనులు ఇప్పటికే 96 శాతం పూర్తయ్యాయని, వేసవి ముగిసేలోపు మిగిలిన పనులన్నీ పూర్తి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. రాగోలులో జెమ్స్ ఎదుట రూ.2.92 కోట్లతో సైనిక్ భవన్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన జరగనున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాకకు వీలుగా అనుకూలమైన ముహూర్తాలు వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. కిడ్నీ సంబంధిత మరణాలపై పత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు సూచించారు. అంతకుముందు, ప్రతి నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, మామిడి గోవిందరావు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి పోషణ పఖ్వాడా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నాటుసారా ముద్దాయిలపై బైండోవర్

పలాస: పలాస మండలంలోని పెదంచల, చినంచల, పెంటిభద్ర, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నాటు సారా కేసులో దొరికిన 35 మంది పాత ముద్దాయిలపై పలాస ఎక్సైజ్ పోలీసులు మంగళవారం బైండోవర్ కేసులు కట్టించారు. పలాస డిప్యూటీ తహసీల్దార్ టి.లక్ష్మీనారాయణ సమక్షంలో వారి కార్యాలయంలో ఈ కేసులు కట్టించారు. ఒక ఏడాది కాలపరిమితికి రూ.లక్ష జరిమానా బాండుతో ఈ కేసులు కట్టినట్టు పలాస ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లిఖార్జునరావు చెప్పారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 10న జిల్లా స్థాయిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, లోక్ అదాలత్ ద్వారా శాంతియుతంగా, పరస్పర అంగీకారంతో తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరని చిచ్చు

డీసీసీబీ కాలనీలో వివాదాస్పదంగా మారిన స్థలం



- జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కాలనీలో వివాదం
- 80 అడుగుల రోడ్డు ఆక్రమణకు గురైందని స్థానికుల ఫిర్యాదు
- డాక్యుమెంట్లు ఉన్నాయని మరోవర్గం వాదన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కాలనీలో స్థల వివాదం నడుస్తోంది. రెండు వర్గాల మధ్య చిచ్చు రేపుతోంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రోడ్డు అని, దాంట్లో ఆక్రమించి కొందరు కట్టడాలు చేస్తున్నారని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయగా, తమకు పక్కా డాక్యుమెంట్లు ఉన్నాయని, వేరే వ్యక్తుల నుంచి దఖలు పడిందని మరో వర్గం వాదనకు దిగుతోంది. ఈ క్రమంలో అక్కడ ప్రశాంతతకు భంగం వాటిల్లుతోంది. ఇప్పుడిది చినికి చినికి గాలివానగా మారి అసలు విషయం పక్కకు వెళ్లి వ్యక్తిగత ద్వేషాలకు దారితీస్తోంది.

శ్రీకాకుళం నగరం డీసీసీబీ కాలనీ ఎక్స్‌టెన్షన్, శ్రీ భూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గల నర్సస్ కాలనీలో 80 అడుగుల రోడ్డు డీటీసీపీ అప్రూవల్‌తో ఎల్పీ నంబర్ 155/88గా రికార్డులో నమోదై ఉందని ఆ కాలనీ వాసులు చెబుతున్నారు. అప్పట్లో నగరం మాస్టర్ ప్లాన్‌లో ఉన్న ప్రకారం ఈ ప్రాంతం 80అడుగుల రోడ్డు కేటాయించారని, నర్సెస్ కాలనీ లేఅవుట్‌లో 37,38,51,52,53,54 ప్లాట్‌లకు సంబంధించిన డాక్యుమెంట్ హద్దులలో కూడా 80 అడుగుల రోడ్డు చూపించారు. అంతేకాకుండా లేఅవుట్ మ్యాప్‌లో కూడా డీటీసీపీ అప్రూవల్ ఎల్పీ నంబర్ 155/88గా ఉన్నత అధికారుల సంతకాలతో కూడా ఉంది. ఒకసారి డీటీసీపీ ఎల్‌పీ నంబర్‌తో అప్రూవల్ అయిన తర్వాత ఈ రోడ్డు ప్రభుత్వానికే చెందుతుందని స్థానికులు చెబుతున్నారు. ఒకసారి అప్రూవల్ అయిన తర్వాత స్థానికంగా రివైజ్డ్ చేయడానికి లేదని, డీటీసీపీ ఎల్‌పీ నంబర్ కేటాయించిన పై స్థాయి అధికారులకు మాత్రమే రివైజ్డ్ చేసే అధికారం ఉంటుందని, ఇక్కడది జరగలేదని కాలనీ వాసులు స్పష్టం చేస్తున్నారు.

వీరి వాదన ఇలా ఉండగా, కొందరు ఇక్కడ తమకు స్థలాలు ఉన్నాయని, వాటికి సంబంధించి డాక్యుమెంట్లు ఉన్నాయని చెప్పడమే కాకుండా చూపించి కట్టడాలకు ఉపక్రమించారు. యంత్రాలను తీసుకొచ్చి పనులకు శ్రీకారం చుట్టారు. తమను అడ్డుకోవడానికి లేదని, పక్కా పత్రాలు ఉన్నాయని, ఇప్పటికే అడ్డుకునేందుకు ప్రయత్నించిన కొందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోర్టు ద్వారా ఉత్తర్వులు వచ్చాయని చెబుతున్నారు. కాలనీ వాసులతో ఢీ అంటే ఢీ అంటూ అంటున్నారు. తమది రిజర్వు స్థలం కాదని, నివాసిత యోగ్య స్థలమని వారు డాక్యుమెంట్లు చూపిస్తున్నారు. ఈ వివాదం గత కొంత కాలంగా నడుస్తోంది. అధికారులు సైతం పూర్తి స్థాయిలో క్లారిటీ ఇవ్వడం లేదు. దీంతో కొత్త వ్యక్తుల కదలికలు, యంత్రాలతో పనులు, కాలనీ వాసులు అడ్డగింత తదితర వ్యవహారాలతో ఇక్కడ పెద్ద లొల్లే నడుస్తోంది. సమస్య పరిష్కారానికి కృషి చేయకపోతే శాంతి భద్రతల సమస్య ఏర్పడే అవకాశం ఉంది.

3 నెలలు.. 7 హత్యలు



పేదవాడి స్వర్గంగా కీర్తిని పొందిన సిక్కోలులో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయి. గత మూడు నెలల కాలంలో జిల్లాలో ఏకంగా 7 హత్యలు చోటు చేసుకున్నాయి. ఇక ఆడపడుచులపై వేధింపులు, దొంగతనాలు, దోపిడీలు, మాదక ద్రవ్యాల వ్యవహారాలైతే చెప్పనక్కర్లేదు. పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా.. అఘాయిత్యాలు మాత్రం ఆగడం లేదు. పెరుగుతున్న ఈ నేర ప్రవృత్తి జిల్లావాసులను ఆందోళనకు గురి చేస్తోంది.

- జిల్లాలో అదుపు తప్పుతున్న శాంతిభద్రతలు
- చిన్నారులు, మహిళలపై ఆగని వేధింపులు

శ్రీకాకుళం క్రైమ్ : సుపారీలు ఇచ్చి హత్యలు చేయించడం, చిన్నారులపై అఘాయిత్యాలకు ఒడిగట్టడం, విద్యాబుద్ధులు నేర్పించాల్సిన టీచర్లే అకృత్యాలకు పాల్పడడం, కాలేజీల్లో మహిళలకు రక్షణ లేకపోవడం.. సిక్కోలులో మునుపెన్నడూ చూడని రీతిలో నేరాలు జరుగుతున్నాయి. జిల్లాలో గడిచిన మూడు నెలల్లో(జనవరి నుంచి మార్చి) ఈ పరిస్థితులు మరింత అదుపు తప్పాయి. శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని సర్కారు పెద్దలు చెబుతున్నా.. పెరుగుతున్న నేరాలు వణుకు పుట్టిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా పోలీసు యంత్రాంగం వీటిపై దృష్టిపెట్టాలని సామాన్యులు కోరుతున్నారు.

హత్యలివే..



- జనవరి 19న జిల్లాకేంద్రంలోని న్యూకాలనీలో పొందూరు మండలం మొదలవలస గ్రామానికి చెందిన 53 ఏళ్ల వివాహిత పూజారి లలితను అతి కిరాతకంగా యువకుడు చంపేశాడు. యువకుడిని జనవరి 25న అరెస్టు చేశారు.
- జనవరి 25న ఆమదాలవలస మండలం బొబ్బిలిపేటలో భర్త గరుగుబిల్లి చంద్రయ్య తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని మరో పదిమందితో కలిసి భార్య ఈశ్వరమ్మ హత్య చేయించింది.
- ఫిబ్రవరి 10న సోంపేట సమీప జింకిభద్ర బీసీకాలనీలో తాగిన మద్యం మత్తులో భార్యను భర్తే (సాహుకారి ఢిల్లీశ్వరరావు) హత్య చేశాడు.
- ఫిబ్రవరి 24న జిల్లాకేంద్రంలోని టి-ఏజెంట్ కాలనీలో ఓ యువకుడు అనుమానాస్పదరీతిలో మృతిచెందాడు. తన భర్త మజ్జి రమేష్‌నాయుడు (34) వేధింపులు తాళలేక తానే హత్య చేయాల్సి వచ్చిందని శశి ఒప్పుకుంది.
- మార్చి 18న ఎచ్చెర్ల మండలంలోని సంతసీతారాంపురం గ్రామానికి చెందిన గాలి నాగమ్మ (42)ను ఆమె భర్త అప్పలరెడ్డి మద్యం మత్తులో దారుణంగా నరికి చంపేశాడు.
- మార్చి 3న నరసన్నపేట బొంతలవీధికి చెందిన కేవిటి గున్నమ్మ (85) అనే వృద్ధురాలు దారుణహత్యకు గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు ముక్కు కమ్మలు కోసం ఆలయం వద్ద నుంచి వివస్త్రగా ఉన్న వృద్ధురాలిని ఈడ్చుకువెళ్లి కామేశ్వరినగర్ వద్ద మారుమూల రోడ్డుపై పడేశారు.
- మార్చి 28న కవిటి మండలంలోని ఆర్.కరాపాడులో ఐదు నెలల గర్భిణి కొంతాల మీనాక్షిని భర్తే సుపారీ ఇచ్చి దాడి చేయించి చంపేశాడు.


దోపిడీలు కూడా..

- మార్చి 6 జిల్లాలోని జి.సిగడాం మండలంలో ఓ వృద్ధురాలికి యువకుడు బైక్ లిఫ్ట్ ఇచ్చి బంగారాన్ని కాజేశాడు. ఆమె కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి.
- మార్చి 12న పలాస మండలం కోశంగిపురం సమీపంలో దుంపల యశోద అనే వివాహితకు బైక్ లిఫ్ట్ ఇచ్చిన తెలియని వ్యక్తి కత్తితో బెదిరించి రెండున్నర తులాలు దోచేశాడు.
- మార్చి 14న టెక్కలి రూరల్ మండలం మోదుగులవలసకు చెందిన ఓ దివ్యాంగ యువతిని లిఫ్ట్ ఇస్తానని బైక్ ఎక్కించి తోటల్లోకి తీసుకెళ్లడంతో ఆమె ప్రతిఘటించి రన్నింగ్ బైక్‌పై నుంచి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి.

దాడులెన్నో..



- జనవరిలో సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్సీపీ కార్యకర్త సిర్లాపు నరేష్ ఇంటికి వెళ్లి చేతులతో కొట్టారు.
- ఫిబ్రవరి 9న పొందూరు మండలం తాడివలస పీహెచ్‌సీ సమీపంలో భార్య పావనిపై క్షణికావేశంలో దాడి చేసిన భర్త ఆమె చనిపోయిందని గ్రహించి పోలీసులకు లొంగిపోయాడు.
- మార్చి 8 మహిళా దినోత్సవం రోజున లావేరుకు చెందిన ఓ వృద్ధురాలు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి కన్నకొడుకే దాడికి ఎగబడ్డాడని, పోలీసులు కేసు నమోదు చేయలేదని మొర పెట్టుకుంది.
- మార్చి 23న ఇచ్ఛాపురం మండలం మఖరాపురం గ్రామంలో ఒక్కగానొక్క విశ్వబ్రాహ్మణ కుటుంబం వైఎస్సార్సీపీకి మద్దతుగా ఉండటంతో ఆ కుటుంబంలోని వ్యక్తిపై టీడీపీ సానుభూతిపరులు దాడి చేశారు.



కల్యాణ వైభోగమే..

అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం వైభవోపేతంగా జరిగింది. రుగ్వేద నియమానుసారం కల్యాణ క్రతువును నిర్వహించారు. అనివెట్టి మండపంలో జరిగిన ఈ వేడుకను చూసి భక్తులు తరించారు.

– అరసవల్లి

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: చైత్ర మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా మంగళవారం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు.



చక్కగా అలంకరించిన పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

క్లుప్తంగా

కిలిమంజారో పర్వతారోహణకు చిరంజీవి



అర్హత పత్రంతో చిరంజీవి, డాక్టర్ పైడి సింధూర తదితరులు

శ్రీకాకుళం అర్బన్: టెక్కలి మండలం కొండభీం పురం గ్రామానికి చెందిన బీపీఈడీ విద్యార్థి సారా చిరంజీవి కిలిమంజారో పర్వతం, రష్యా ఎల్రోస్ పర్వతాల అధిరోహణకు అర్హత సాధించాడని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి డాక్టర్ పైడి సింధూర అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక పర్వతారోహణకు ఆటంకాలు ఎదురవుతున్నాయని, దాతలు సహకరిస్తే మౌంట్ ఎవరెస్ట్ లాంటి పెద్ద పెద్ద పర్వతాలను అధిరోహించి మన దేశానికి మంచి పేరు తీసుకొస్తారని చెప్పారు. లయన్స్‌క్లబ్ తరఫున తమవంతు సహకారం తప్పక అందిస్తామన్నారు. చిరంజీవి మాట్లాడుతూ ఆక్సిజన్ సిలిండర్లు లేకుండా అధిరోహించడం తన లక్ష్యమని పేర్కొన్నారు. తనను ప్రోత్సహిస్తున్న లయన్స క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం వారికి, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమాశంకర్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఏజీపీగా సుదర్శనరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా బొత్స సుదర్శనరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడేళ్ల పాటు కొనసాగుతారు.

'డ్వాక్రా' అభ్యున్నతిపై ఒడిశా బృందం ఆరా



మహిళా సమాఖ్య ప్రతినిధులతో మాట్లాడుతున్న ఒడిశా బృంద సభ్యులు

గార: రాష్ట్రంలో మహిళా సంఘాల బలోపేతం, జీవనోపాధి మార్గాలు తదితర అంశాలపై ఒడిశా రాష్ట్ర బృంద సభ్యులు ఆరా తీశారు. మంగళవారం గార మండల మహిళా సమాఖ్య సభ్యులతో అడిషనల్ సీఈవో మహాపాత్, డైరెక్టర్ ఎస్.రావత్ సమావేశమై అంశాల వారీగా తెలుసుకున్నారు. గ్రామ సంఘం రిజిస్ట్రేషన్ నుంచి మొదలుకొని నాయకత్వ మార్పిడి, సభ్యత్వ వాటాధనం, పొదుపు వాడకం, రుణాల వినియోగం, చెల్లింపుల్లో జరిగే ఇబ్బందులపై సుదీర్ఘంగా చర్చించారు. మండల సమాఖ్య సంఘం ఆడిట్, పుస్తకం నిర్వహణ, కుటుంబ వ్యవస్థకు ఆర్థిక చేయూత వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. మండల ఈసీ సభ్యులు రుణాల రికవరీపై వివరించారు. కార్యక్రమంలో విజయవాడ సెర్ప్ కార్యాలయ అధికారి వీరశేఖర్, లైవ్లీ హుడ్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్.ఎస్.మూర్తి, బ్యాంకు లింకేజీ అధికారులు, ఏరియా కో ఆర్డినేటర్‌లు, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

జనం రోడ్డెక్కితే.. అధికారులదే బాధ్యత

- రైతులు రెండో పంట వేయవద్దన్నా వినడం లేదు
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు
- నరసన్నపేటలో రూ.80 లక్షల స్కామ్: ఎమ్మెల్యే బగ్గు
- ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రివిలైజ్ కమిటీకి ఫిర్యాదు: ఎమ్మెల్సీ విక్రాంత్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు



హాజరైన ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు

అరసవల్లి:

జిల్లాలో స్థానిక సంస్థల పరిధిలో ప్రొటోకాల్ ఉల్లంఘనలు, పాలక పార్టీకి అధికారులు కొమ్ముకాయడం, అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించడం, తాగునీటికి వేసవి ప్రణాళిక తదితర అంశాలపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వాడీవేడిగా చర్చ జరిగింది. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, డ్వామా, విద్యుత్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, జిల్లా పంచాయతీ, వైద్యారోగ్యశాఖ తదితర శాఖల ప్రగతి నివేదికలపై చర్చించారు. ముందుగా దివంగత జెడ్పీ చైర్మన్, మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం మృతి పట్ల నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, తూర్పు కాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకూడదు..

జిల్లాలో చాలా చోట్ల తాగునీటికి ఇబ్బందులు వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇప్పటికైనా ప్రణాళికపరంగా పనిచేయాలని, ఇక ఎక్కడైనా నీటి కోసం రోడ్డెక్కితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. జల్‌జీవన్ మిషన్(జేజేఎం) పథకానికి సంబంధించి పైపులు తవ్వి పనులు వదిలేసిన కాంట్రాక్టర్లను మళ్లీ పిలిపించి వెంటనే పని పూర్తి చేయించాలని, లేకుంటే కాంట్రాక్ట్ రద్దు చేయాలని ఆదేశించారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలు మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో జేజేఎం పనులకు ఈ ప్రభుత్వం రూ.2 వేల కోట్లను కేటాయించిందని, వాస్తవానికి ఈ ఏడాది జూన్‌తోనే పథకం ముగియాల్సి ఉన్నా సీఎం చంద్రబాబు చొరవతో మరో మూడేళ్లు పొడిగించారని వివరించారు. జిల్లాలో వేసవి తీవ్రత అధికంగా ఉంటుందని, ఇప్పటికే వంశధారలో నీరు లేదని, చెరువులు, వాగులన్నీ ఇంకిపోయాయని, అయినా రైతులకు రెండో పంట వెయ్యొద్దని చెప్పినా వినలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలని నిర్ణయించామన్నారు. సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లేకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని జెడ్పీటీసీ సభ్యులను కోరారు. జిల్లా వైద్యారోగ్యశాఖ పనితీరు దారుణంగా ఉందని, ఎన్నడూ లేనంతగా అక్రమాలు పెరిగిపోయాయని, ఏళ్లతరబడి కొందరు ఉద్యోగులు తిష్టవేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో కలెక్టర్‌తో కలిసి సమీక్ష చేస్తామన్నారు. ఆక్వా రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకుంటే యూనిట్ విద్యుత్ రూ.1.50 చొప్పున ఇస్తామని ప్రకటించారు.

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో వెలుగు పథకంలో రూ.80 లక్షల స్కామ్ జరిగిందని, సీఎఫ్ సీసీలు ఏకంగా బ్యాంకు ఖాతాల నుంచి వ్యక్తిగత ఖాతాలకు డబ్బులు జమ చేసుకున్నట్లు ఆధారాలతో దొరికిపోయారని, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పోలాకి మండలంలో జేజేఎం కుళాయి పనులు ఆపేశారని, కాంట్రాక్ట్‌ను రద్దు చేయకుండా అధికారులు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం డివిజన్ పీఆర్ ఈఈ పోస్టు పుట్టపర్తి సత్యసాయి జిల్లాకు తరలిపోయిందని, జిల్లా అవసరాల దృష్ట్యా మళ్లీ ఇక్కడికి తీసుకురావాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కోరారు.

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ పాతపట్నం, హిరమండలంలో దాహం కేకలు వినిపిస్తున్నాయని. ఇప్పటికే హిరమండలంలో జనం రోడ్డెక్కారని, తక్షణమే వేసవి ప్రణాళిక పనులు ప్రారంభించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి: జెడ్పీ చైర్‌పర్సన్

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఉద్దానంలో గత ప్రభుత్వంలో నిర్మించిన భారీ తాగునీటి ప్రాజెక్టు నుంచి పలాస మున్సిపాలిటీతో పాటు ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి కూడా మంచినీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులతో ఇటీవల కాలంలో చాలా మంది మృతి చెందారని, డయాలసిస్ కోసం కవిటిలో ఒక బెడ్ గానీ, ఇచ్ఛాపురంలో రెండు బెడ్లు గానీ సిద్ధం చేస్తే రోగులకు దూరావస్థలు తగ్గుతాయన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై చర్చ

ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండల సర్వసభ్య సమావేశంలో ప్రొటోకాల్ పాటించకపోవడంతో పాటు అక్కడి ఎంపీడీఓ ఏకంగా పోలీసులకు చెప్పి తనను బయటకు తీసుకెళ్లమని ఆదేశించారని, దీనిని అగౌరవంగా భావిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రివిలైజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానని ప్రకటించారు. జిల్లాల్లో అధికార పార్టీ నేతల హడావుడి దారుణంగా ఉందన్నారు. జెడ్పీ సమావేశంలో ప్రతిసారీ మంత్రి అచ్చెన్నాయుడు గత ఐదేళ్లు దారుణాలు జరిగాయని, గత ప్రభుత్వమంటూ పదేపదే మాట్లాడుతున్నారని. ముందుగా సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. దీనిపై మంత్రి స్పందిస్తూ..గత ప్రభుత్వంలో తన నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న తనకే ఆహ్వానం లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా మూలపేట పోర్టుకు శంకుస్థాపన చేశారని.. తాను ఆపాలనుకుంటే మూలపేట పోర్టు నిర్మాణం జరిగేదా అని ప్రశ్నించారు. ఇకపై జిల్లాలో ఎక్కడ ప్రొటోకాల్ ఉల్లంఘనపై నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామమూర్తి మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లను కూడా శంకుస్థాపన శిలాఫలకాలపై పెట్టడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పనులకు సంబంధించిన బిల్లులు ఆన్‌లైన్ చేసేందుకు టీడీపీ నేతల అనుమతి కావాలని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఓ రహదారి శంకుస్థాపనలో రాష్ట్ర మంత్రి, కేంద్రమంత్రి పేర్లు తప్ప మరెవ్వరి పేర్లను అధికారులు పెట్టలేదని చెప్పారు.

ప్రశ్నించకపోతే రూ.50 వేలు ఇస్తారట: ఎంపీపీ మొదలవలస



ఎచ్చెర్ల మండలంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ కింద సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, చాలా చోట్ల నాణ్యత పట్టించుకోవడం లేదని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. కాంట్రాక్టర్లతో పీఆర్ ఇంజినీర్లు కుమ్మక్కై 10 శాతం పీసీలు వసూళ్లు చేసుకుని నాణ్యత లేకుండా రోడ్లు నిర్మిస్తున్నారని చెప్పారు. దీనిపై తాను అధికారులను ప్రశ్నిస్తే 'రూ.50 వేలు ఇస్తాం.. నాణ్యత విషయంలో మాత్రం అడగవద్దు' అని అన్నారని ఎంపీపీ ఆరోపించారు. దీనిని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా పరిగణించి.. పరిశీలించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై వాగ్వాదాలు పెరుగుతున్న తరుణంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది.

పేద కుటుంబంపై కక్ష సాధింపు

- ఆక్రమణల పేరిట సాగుభూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు
- బాధితులు ఎదురు తిరగడంతో రంగంలోకి దిగిన పోలీసులు



రాజపురంలో మోహరించిన పోలీసులు

పోలాకి: మండలంలోని రాజపురం గ్రామంలో ఓ కుటుంబంపై అధికార పార్టీ కక్షసాధింపు చర్యలకు దిగింది. గ్రామానికి చెందిన అవ్వ శాంతమ్మ, గేదెల శారద తదితర కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికారనే కారణంతో అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు దిగారు. దాదాపు నలభై ఏళ్లుగా సాగులో ఉన్న పొలాన్ని చెరువు ఆక్రమణ పేరుతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడికి తెచ్చి తొలగించారు. ఇటీవల అక్కడికి వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై బాధిత కుటుంబాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఇదేం అన్యాయం అంటూ తిరగబడటంతో మంగళవారం దాదాపు 30 మంది పోలీసులు, మరో పది మంది రెవెన్యూ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. తహశీల్దార్ సురేష్‌కుమార్ సమక్షంలో బాధితులకు చెందిన 38 సెంట్ల పొలాన్ని తొలగించారు. తాము అదే రెవెన్యూలో వీఆర్‌ఏలు పనిచేస్తున్న వ్యక్తుల కుటుంబాల వద్ద కొనుగోలు చేశామని, కొంత సమయం ఇవ్వాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని, అధికార పార్టీ కార్యకర్తల ఆలోచనలే అమలు చేశారని బాధితులు ఆరోపించారు. ఈ విషయమై తహశీల్దార్ ఆర్.సురేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. గ్రామస్తుల ఫిర్యాదు మేరకే రాజపురంలో కప్ప చెరువు ఆక్రమణలు తొలగించామని చెప్పారు. సర్వే నెంబర్ 26, 28లలో చెరువుతో పాటు శ్మశానానికి చెందిన 1.95 ఎకరాల్లో మొత్తం 14 మందికి చెందిన ఆక్రమణలను గుర్తించి వాటిని పూర్తిగా తొలగించామన్నారు. కచ్చితమైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే మిగిలిన చెరువుల ఆక్రమణలను సైతం తొలగించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీకి ఓటు వేశామనే..



గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటేశామనే అక్కసుతోనే ఇలా చేశారు. కావాలనే మాపై కొందరు టీడీపీ నాయకులు కక్ష సాధిస్తున్నారు. పెద్ద మనుషుల ముసుగులో వీరు చేస్తున్న దోపిడీలు, అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తాం.

– గేదెల శారద, బాధిత మహిళ, రాజపురం

ఎస్సీ వర్గీకరణను ఐక్యతతో అడ్డుకుందాం



నిరసన తెలుపుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం (పిఎన్ కాలనీ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దళితుల మధ్య వర్గీకరణ పేరుతో చిచ్చుపెట్టి వివాదాలు సృష్టిస్తున్నాయని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం కమిటీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.బెంజమన్ మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆదివారంపేటలో అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని అంబేడ్కర్ ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాల మధ్య వర్గీకరణ పేరుతో కుంపట్లు పెట్టి అశాంతి సృష్టించడం తగదన్నారు. వర్గీకరణ సాధ్యం కాదని ప్రభుత్వాలకు తెలిసినా అధికారం కోసం కొందరిని అడ్డం పెట్టుకొని చిచ్చురేపుతున్నారని ధ్వజమెత్తారు. విభజనను అడ్డుకుని తీరుతామని, అవసరమైతే ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.అంబేడ్కర్, విశ్రాంత తహశీల్దార్ రామప్పడు, సంజీవరావు ఆర్.సూర్యనారాయణ, డి.గోవిందరావు, కె.తవితయ్య, కె.రాజులు, గెడ్డపు రమణ, పి.అప్పన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చెట్టు నుంచి జారిపడి విశ్రాంత జవాన్ మృతి



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నరసన్నపేట: మండలంలోని లుకలాంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి బొత్స శ్రీరాములు (50) ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి జారి పడి మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 9 గంటలకు చింత చెట్టు బొట్టలు దులిపేందుకు శ్రీరాములు వెళ్లారు. సూరోడమ్మ ఇంటి పనులు ముగించుకొని చెట్టు వద్దకు వెళ్లేసరికి శ్రీరాములు చెట్టు కింద పడి కనిపించారు. కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించి స్థానికుల సహకారంతో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చెట్టు పైనుంచి పడిపోయే సమయంలో ఎవరూ లేకపోవడంతో మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. శ్రీరాములుకు ఇద్దరు కుమార్తెలు. నరసన్నపేట పోలీసులు ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. భార్య సూరోడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో రోడ్డు ప్రమాదం

- చిగురువలసకు చెందిన హోంగార్డు మృతి



సింహాచలం (ఫైల్)

సరుబుజ్జిలి: తెలంగాణా రాష్ట్రం మియాపూర్ వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు నల్లాన సింహాచలం(40) సోమవారం రాత్రి లారీ ఢీకొట్టడంతో ఆస్పత్రిలో చికిత్స పొందు తూ మృతిచెందాడు. మృతుడి స్వగ్రామం సరుబుజ్జిలి మండలం చిగురువలస. తండ్రి త్రినాధరావు ఇటీవలే గుండెపోటుతో మృతిచెందాడు. సింహాచలంకు భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 15 ఏళ్లగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. అందరితో మంచిగా ఉండే సింహాచలం మృతి చెందడం పట్ల గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



గయా బాల మృతదేహం

ఆమదాలవలస/శ్రీకాకుళం రూరల్: పురపాలక సంఘ పరిధిలోని నాలుగో వార్డు గేదెలవానిపేట కసింవలస మధ్య ఊర చెరువులో చేపల వేటకు దిగి మత్స్యకారుడు మృతిచెందాడు. మెట్టక్కివలస మండల వీధికి చెందిన గయా బాల (47) సోమవారం రాత్రి తోటి మత్స్యకారులతో కలిసి చేపల వేటకు వెళ్లాడు. అందరూ ఒడ్డుకు చేరుకున్నా ఆయన కనిపించకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటికే చెరువు మధ్యలో మునిగి ప్రాణాలు కోల్పోవడంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు వివాహాలైన కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఇరువర్గాల కొట్లాట

రణస్థలం: రణస్థలం పంచాయతీ నగరప్పాలెంలో పొలానికి నీరు వదిలే క్రమంలో సొంత బంధువులు మంగళవారం ఉదయం కొట్లాటకు దిగారు. జే.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒకే కుటుంబంలోని బంధువులకు వ్యవసాయ మోటార్ బోరు ఒకటే ఉంది. పొలాలకు నీరు వాటాల ప్రకారం వాడుకోవాలని గతంలో తీర్మానం చేసుకున్నారు. అయితే ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ వాడుకుంటున్నారని ఇరువర్గాలు మంగళవారం కొట్లాటకు దిగారు. ఈ ఘటనలో పాట్నూరు రామకృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళం ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పాట్నూరు తవిటినాయుడు, అప్పలనాయుడులపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



యువకుడి మృతదేహం

కాశీబుగ్గ/ఇచ్ఛాపురం: పలాస రైల్వే జీఆర్‌పీ పరిధిలోని ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలోని సూదికొండ వద్ద గుర్తు తెలియని యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. మృతుడి వయసు 20 – 25 ఏళ్లు ఉంటుందని, ఆనవాళ్లు బట్టి మృతుడు పెయింటింగ్ పని చేసేవారిలా ఉన్నాడని రైల్వే పోలీసులు చెబుతున్నారు. నీలం షర్టు, నీలం ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ డి.హరినాథ్(8985021143)ను సంప్రదించాలని కోరారు.

అదుపు తప్పిన బైక్..ముగ్గురికి గాయాలు

నరసన్నపేట: కోమర్తి వద్ద జాతీయ రహదారిపై వంతెనపై మంగళవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. పాతపట్నం మండలం కొరసవాడకు చెందిన యువకులు శ్రీను, వాసు, మనోజ్‌లు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ఢిల్లీ చేరిన గార ఎస్‌బీఐ బాధితుల ఆందోళన



జంతర్‌మంతర్ వద్ద ప్లకార్డులతో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : గార ఎస్‌బీఐలో తనఖా బంగారం మాయం కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. పోలీసులు, వ్యవస్థలను తప్పుదోవపట్టించి బ్యాంకు ఉన్నతాధికారులు ఎన్నో అవకతవకలకు పాల్పడ్డారని, ఓ మహిళా ఉద్యోగిని నిండుప్రాణాన్ని బలిగొన్నారని ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద జిల్లావాసులు సోమవారం ఆందోళనకు దిగారు. వీరిలో చనిపోయిన బ్యాంకు ఉద్యోగిని ఉరిటి స్వప్నప్రియ కుటుంబీకులున్నారు. ఆర్ఎం టీఆర్ఎం రాజును బర్తరఫ్ చేయాలని, శ్రీకాకుళం రీజియన్‌లో ఎస్‌బీఐలో జరిగిన కుంభకోణాలన్నింటిపై విచారణ చేపట్టాలని, స్వప్నప్రియ మరణానికి కారకులను శిక్షించాలంటూ ప్లకార్డులు పట్టుకుని ధర్నా చేపట్టారు. ఎస్‌బీఐ చైర్మన్ కార్యాలయానికి తప్పుడు నివేదికలు అందించడంతో ఫిర్యాదు చేసి ఆరునెలలు గడుస్తున్నా టీఆర్ఎం రాజుపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తన కుటుంబానికి అన్యాయం చేసిన రాజుతో పాటు డీజీఎంపై కూడా చర్యలు తీసుకోవాలని స్వప్నప్రియ తల్లి సరళ కోరారు.

'పేపర్లు తెచ్చి బళ్లు పట్టుకెళ్లండి'

శ్రీకాకుళం క్రైమ్ : ఎప్పటి నుంచో జిల్లాకేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు తనిఖీల్లో దొరికిన 48 ద్విచక్ర వాహనాలు ఉండిపోయాయి. ఇప్పటికైనా వాహన యజమానులు సంబంధిత పత్రాలను ఈనెల 12 లోగా తెచ్చి తమ తమ వాహనాలను పట్టుకెళ్లిపోవచ్చని ట్రాఫిక్ సీఐ నాగరాజు మంగళవారం స్పష్టం చేశారు. లేదంటే ద్విచక్రవాహనాలు ఆక్షన్(వేలం)లో వేరేవారి సొంతమవుతాయని పేర్కొన్నారు. వాహన యజమానులు పత్రాలతో పాటు ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.